నేటి మ్యాచ్
న్యూజిలాండ్ X శ్రీలంక
మ. 2.00 నుంచి
వేదిక: బెంగళూరు

స్టోక్స్ సూపర్

నెదర్లాండ్స్‌పై ఇంగ్లండ్ ఘన విజయం

సెంచరీతో విజృంభణ • రాణించిన మొయిన్ అలీ, ఆదిల్ రషీద్

హమ్మయ్య! డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ ఎట్టకేలకు గెలుపు రుచిచూసింది. సరిగ్గా నెలరోజుల క్రితం బంగ్లాదేశ్‌పై బోణీ కొట్టిన ఇంగ్లండ్..ఆరు ఓటముల తర్వాత నెదర్లాండ్స్‌పై గెలిచింది. బెన్‌స్టోక్స్ సూపర్ సెంచరీకి మలాన్, వోక్స్ అర్ధసెంచరీలు జతకలిసిన వేళ భారీ స్కోరు అందుకున్న బట్లర్ గ్యాంగ్.. డచ్ టీమ్‌ను స్పిన్ ఉచ్చులో బంధించింది. మొయిన్ అలీ, ఆదిల్ రషీద్ విజృంభణతో నెదర్లాండ్స్ 179 పరుగులకే కుప్పకూలి సెమీస్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది.

పుణె: మెగాటోర్నీ ముగింపు దశకు చేరిన వేళ ఇంగ్లండ్ ఖాతాలో రెండో విజయం చేరింది. బుధవారం నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 160 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా ఎనిమిది మ్యాచ్‌ల్లో రెండో విజయంతో ఏకంగా పదో స్థానం నుంచి ఏడుకు ఎగబాకింది. దక్షిణాఫ్రికా లాంటి మేటి జట్టును మట్టికరిపించిన డచ్ టీమ్ ఆటలు ఇంగ్లండ్ ముందు సాగలేదు. తొలుత బెన్‌స్టోక్స్(84 బంతుల్లో 108, 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) సూపర్ సెంచరీకి తోడు మలాన్(87), క్రిస్ వోక్స్(51) అర్ధసెంచరీలతో ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 339/9 భారీ స్కోరు చేసింది. బాస్ డీ లిడె(3/74) మూడు వికెట్లు పడగొట్టగా, ఆర్యన్‌దత్, వాన్ బీక్ రెండేసి వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన నెదర్లాండ్స్..అలీ(3/42), రషీద్(3/54) ధాటికి 37.2 ఓవర్లలో 179 పరుగులకు పరిమితమైంది. తేజ(41 నాటౌట్), కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్(38) టాప్ స్కోరర్లుగా నిలిచారు. విల్లే రెండు వికెట్లు తీశాడు. ప్రపంచకప్‌లో తొలి సెంచరీతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన స్టోక్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇంగ్లండ్ తమ ఆఖరి మ్యాచ్‌లో ఈనెల 11న పాకిస్థాన్‌తో తలపడనుండగా, 12న నెదర్లాండ్స్..భారత్‌తో ఆడనుంది.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్: 50 ఓవర్లలో(స్టోక్స్ 108, మలాన్ 87, డీ లిడే 3/74, ఆర్యన్ 2/67), **నెదర్లాండ్స్:** 37.2 ఓవర్లలో 179 ఆలౌట్(తేజ 41 నాటౌట్, ఎడ్వర్డ్స్ 38, అలీ 3/42, రషీద్ 3/54)

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్ ✓	8	8	0	+2.45	16
దక్షిణాఫ్రికా ✓	8	6	2	+1.37	12
ఆస్ట్రేలియా ✓	8	6	2	+0.86	12
న్యూజిలాండ్	8	4	4	+0.39	8
పాకిస్థాన్	8	4	4	+0.03	8
అఫ్గానిస్థాన్	8	4	4	−0.33	8
ఇంగ్లండ్ X	8	2	6	−0.88	4
బంగ్లాదేశ్ X	8	2	6	−1.14	4
శ్రీలంక X	8	2	6	−1.16	4
నెదర్లాండ్స్ X	8	2	6	−1.63	4

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

ప్రపంచకప్‌లో స్టోక్స్‌కు ఇది తొలి సెంచరీ

1 ఓవరాల్‌గా వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఇంగ్లండ్ బౌలర్‌గా వోక్స్(30) నిలిచాడు. బోథమ్(30), ఫిల్ డెఫ్రిట్స్(29), అండర్సన్(27) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు.

వన్డే ప్రపంచకప్ చరిత్రలో ప్రతీ జట్టు రెండేసి మ్యాచ్‌లు గెలువడం ఇదే తొలిసారి

చాంపియన్స్ ట్రోఫీ రేసులో: పాకిస్థాన్ వేదికగా 2025 జరిగే చాంపియన్స్ ట్రోఫీ రేసులో ఇంగ్లండ్ నిలిచింది. నెదర్లాండ్స్‌పై గెలువడం ద్వారా ఇంగ్లండ్ టాప్-7లోకి దూసుకొచ్చింది. మెగాటోర్నీలో టాప్-7లో ఉన్న జట్లు నేరుగా చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధిస్తాయి.

సిరాజ్, గిల్ నంబర్‌వన్

• ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్‌లోకి

దుబాయ్: ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమ్ ఇండియా క్రికెటర్లు మహమ్మద్ సిరాజ్, శుభ్‌మన్‌గిల్ దుమ్మురేపారు. అద్భుత ఫామ్‌తో అదరగొడుతున్న వీరిద్దరు తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్ దక్కించుకున్నారు. బుధవారం విడుదలైన ర్యాంకింగ్స్‌లో గిల్ 830 పాయింట్లతో తొలిసారి అగ్రస్థానం కైవసం చేసుకుంటే హైదరాబాదీ స్పీడ్‌స్టర్ సిరాజ్(709) మళ్లీ నంబర్‌వన్‌లోకి వచ్చాడు. సచిన్, ధోనీ, కోహ్లీ తర్వాత బ్యాటింగ్‌లో టాప్ ర్యాంక్ సొంతం చేసుకున్న నాలుగో భారత బ్యాటర్‌గా గిల్ రికార్డు సొంతం చేసుకున్నాడు. ప్రపంచకప్‌లో నిలకడగా రాణిస్తున్న గిల్..పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్(824)ను వెనుకకు నెడుతూ అగ్రస్థానాన్ని అధిష్టించాడు. భారత్ నుంచి కోహ్లీ(770), రోహిత్‌శర్మ(739) వరుసగా నాలుగు, ఆరు ర్యాంక్‌ల్లో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో కుల్దీప్‌యాదవ్ (661) నాలుగులో, బుమ్రా ఎనిమిదిలో (654), షమీ (635) పదో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.

కోహ్లీ @ షాట్ ఆఫ్ ద సెంచరీ

• ఐసీసీ అధికారికంగా వెల్లడి

లండన్: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది. తన అద్భుత ఆటతీరుతో ఇప్పటికే లెక్కకు మిక్కిలి రికార్డులు సొంతం చేసుకున్న కింగ్ కోహ్లీ మరో అరుదైన ఘనతను దక్కించుకున్నాడు. గతేడాది మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియంలో దాయాది పాకిస్థాన్‌తో జరిగిన టీ20 ప్రపంచకప్ పోరులో కోహ్లీ విశ్వరూపం ప్రదర్శించాడు. విజయానికి 8 బంతుల్లో 28 పరుగులు అవసరమైన స్థితిలో పాక్ పేసర్ హరిస్ రవూఫ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ కోహ్లీ కొట్టిన కండ్లు చెదిరే సిక్స్‌ను ఐసీసీ షాట్ ఆఫ్ ద సెంచరీగా ప్రకటించింది. విరాట్ పుట్టిన రోజు సందర్భంగా ఐసీసీ తమ అధికారిక ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోను పోస్ట్ చేసింది. ఈ శతాబ్దపు అత్యుత్తమ షాట్ అంటూ ఐసీసీ కొనియాడింది. ఆఖరి వరకు ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో పాక్‌పై భారత్ విజయదుందుభి మోగించిన సంగతి తెలిసిందే.

హైదరాబాద్ మ్యాచ్ బెంగళూరుకు

భారత్, ఆసీస్ టీ20 పోరు వేదిక మార్పు

హైదరాబాద్: భారత్, ఆస్ట్రేలియా మధ్య డిసెంబర్ 3వ తేదీన జరుగాల్సిన ఐదో టీ20 మ్యాచ్ వేదిక మారింది. షెడ్యూల్ ప్రకారం ఇరు జట్ల మధ్య జరిగే చివరి పోరుకు హైదరాబాద్ ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం ఆతిథ్యమివ్వాల్సింది. అయితే అదే రోజు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదల అవుతున్నాయి. ఈ నేపథ్యంలో మ్యాచ్‌కు పూర్తి స్థాయి భద్రతా ఏర్పాట్లు చేయలేమని రాచకొండ పోలీసులు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని బీసీసీఐ దృష్టికి హెచ్‌సీఏ తీసుకెళ్లింది. ఈ క్రమంలో మ్యాచ్ వేదికను బెంగళూరుకు మారుస్తున్నట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. దీంతో హైదరాబాద్‌లో భారత్ మ్యాచ్ చూడాలనుకున్న క్రికెట్ అభిమానులకు మరోమారు నిరాశ ఎదురైంది. ఇదిలా ఉంటే జనవరిలో అఫ్గానిస్థాన్‌తో మ్యాచ్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు మార్చే అవకాశముంది.

యాచింగ్‌లో డబుల్ ధమాకా

పనాజీ(గోవా): గోవా వేదికగా జరుగుతున్న 37వ జాతీయ క్రీడల్లో తెలంగాణ ప్లేయర్లు పతకాలు కొల్లగొడుతున్నారు. బుధవారం జరిగిన బాలుర యాచింగ్ ఐఎల్‌సీఏ-4 విభాగంలో రాష్ట్రానికి చెందిన విశ్వనాథ్ పడిదాల పసిడి పతకంతో మెరిశాడు. మరోవైపు బాలికల ఐఎల్‌సీఏ-6 కేటగిరీలో అశ్విని రజత పతకం ఖాతాలో వేసుకుంది. 4 స్వర్ణాలు, 10 రజతాలు, 11 కాంస్యాలతో తెలంగాణ 22వ స్థానంలో ఉంది.

కొయంబత్తూరు వేదికగా జరుగుతున్న జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 60మీ టర్ల విభాగంలో కాంస్య పతకం సాధించిన ప్రశంసను బుధవారం అభినందిస్తున్న చీఫ్ కోచ్ నాగపురి రమేశ్

భారత్‌కు రెండు కాంస్యాలు

బాంకాక్ : ఆసియన్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్లు బుధవారం రెండు కాంస్యాలు దక్కించుకున్నారు. అంతేగాక మరో నాలుగు విభాగాల్లో ఫైనల్స్‌కు చేరి పతకాలు ఖాయం చేసుకున్నారు. పురుషుల కాంపౌండ్ విభాగంలో అభిషేక్ వర్మ, ప్రథమేష్ పుజె, ప్రియాంశ్‌లతో కూడిన భారత జట్టు షూటాఫ్‌లో 29-28 స్కోరుతో చైనీస్ తైపీని ఓడించి కాంస్యం గెలుచుకుంది. కాగా పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో అభిషేక్ వర్మ కాంస్యం గెలుచుకున్నాడు. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్ ఫైనల్స్‌కు చేరి స్వర్ణ, రజత పతకాలు ఖాయం చేశారు. కాంపౌండ్ టీమ్ విభాగంలోనూ భారత జట్టు థాయిలాండ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరింది. ఫైనల్లో చైనీస్ తైపీతో తలపడుతుంది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలోనూ భారత జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది.

కివీస్‌కు కీలకం.. పరువు కోసం లంక

బెంగళూరు : సెమీస్ స్థానంకోసం పాకులాడుతున్న జట్టు ఒకటి. సెమీస్‌కు అర్హత కోల్పోయిన జట్టు మరొకటి. ఈ మ్యాచ్ గెలిచి నాకౌట్‌కు చేరుకోవాలని కివీస్ జట్టు భావిస్తుంటే చివరి మ్యాచ్‌లో విజయంతో ముగించాలని శ్రీలంక ఆశిస్తున్నాయి. లంక కంటే కివీస్‌కే ఈ మ్యాచ్ కీలకం. కేవలం విజయం మాత్రమే కివీస్‌ను నాకౌట్‌కు చేర్చదు. నెట్‌రన్‌రేట్‌ను కూడా ఎంతో మెరుగుపరచుకోవాలి. అందుకు భారీ విజయం అవసరం. కివీస్ బ్యాటర్లు రాణిస్తున్నా వారి బౌలర్లు ఇంకా పట్టు సాధించలేకపోతున్నారు. ఇదే వేదికలో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో న్యూజిలాండ్ 400కు పైగా పరుగులు సాధించినా, బౌలర్ల వైఫల్యంతో ఓటమి తప్పలేదు. మ్యాచ్‌కు వర్షం అంతరాయం కల్గించే చాన్స్ ఉంది.

ఏఐఎఫ్ఎఫ్ కార్యదర్శికి ఉద్వాసన

న్యూఢిల్లీ : ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య(ఏఐఎఫ్ఎఫ్) ప్రధాన కార్యదర్శి షాజి ప్రభాకరన్‌ను ఆ పదవినుంచి తొలగిస్తున్నట్టు సమాఖ్య అధ్యక్షుడు కల్యాణ్ చౌబె ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభాకరన్ చర్యలు ఆమోదయోగ్యంగా లేవని, అవిశ్వాసం కారణంగా అతనిని తక్షణమే పదవినుంచి తొలగిస్తున్నట్టు, అతని స్థానంలో డిప్యూటీ కార్యదర్శి సత్యనారాయణ తాత్కాలికంగా బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. సమాఖ్య ఉపాధ్యక్షుడు హారిస్ కూడా ఈ చర్యను సమర్థిస్తూ ప్రభాకరన్ పట్ల ఎగ్జిక్యూటివ్ కమిటీ కూడా సంతృప్తిగా లేదని తెలిపారు. కాగా తన ఉద్వాసనపై ప్రభాకరన్ స్పందిస్తూ ఇది తనపై జరిగిన కుట్రగా అభివర్ణిస్తూ, తనను తొలగించే అధికారం ఎగ్జిక్యూటివ్ కమిటీకి మాత్రమే ఉందన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.